
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
గురువారం, 18 ఏప్రిల్ 2024
5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	44	27
భద్రాద్రి	43	27



కల్యాణంలో పాల్గొన్న సీఎస్, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు




మాంగల్యధారణ చేస్తున్న అర్చకులు



మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకుడు

పులకించిన భద్రగిరి



చింతాకు పతకాన్ని చూపుతున్న అర్చకుడు

- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి
- తరలివచ్చిన భిన్న రంగాల ప్రముఖులు
- తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా పోటెత్తిన భక్తజనం
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతికుమారి
- సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించిన వైదిక బృందం
- గుబాళించిన ఆలయ సంస్కృతీ సంప్రదాయాలు
- గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



సామాన్యుల్లా వచ్చి తిలకించాం

మల్లు భట్టివిక్రమార్క, డిప్యూటీ సీఎం



ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈసారి సామాన్యుల్లా టికెట్లు కొనుగోలు చేసి కుటుంబంతో కలిసి రామయ్య కల్యాణాన్ని తిలకించాం. భవిష్యత్తులో మంచి వర్షాలు కురవాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకల జనులు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీసీతారాములను కోరుకున్నాం.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి



రాముని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నా. తెలంగాణ ప్రజలు గుండెల్లో పెట్టుకున్న ఇందిరమ్మ ప్రభుత్వం పరిపాలన చల్లగా ఉండేలా రామయ్య దీవించాలని కోరుకున్నా. తెలుగు మాట్లాడే ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు..

లోక కల్యాణం కావాలని కోరుకున్నా

కొండా సురేఖ, దేవాదాయ శాఖ మంత్రి



భద్రాద్రి రామయ్య కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది. నేను తొలిసారిగా భద్రాద్రి రామయ్య కల్యాణం ప్రత్యక్షంగా తిలకించా. ఎన్నికల కోడ్ ఉన్నందున మేమంతా టికెట్లు కొనుగోలు చేసి స్వామి వారి కల్యాణాన్ని తిలకించాం. రామ కల్యాణం లోక కల్యాణం కావాలని కోరుకున్నా.

రమణీయంగా సాగిన రాములోరి కల్యాణం

భద్రాచలం, ఏప్రిల్ 17: పావన గోదావరి తీరాన వెలసిన భద్రాచల శ్రీసీతారామ పుణ్యక్షేత్రంలో రాములోరి కల్యాణం రమణీయంగా సాగింది. 'శ్రీరామ జయ రామ జయజయ రామా..' అంటూ భక్తజనకోటి రామ నామ స్మరణ చేస్తుండగా... దశరథ కుమారుడు శ్రీరామచంద్రునికి, జనకుని కుమార్తె సీతమ్మకు కల్యాణం వైభవోపేతంగా సాగింది. కల్యాణ తంతును తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనంతో భద్రాద్రి పులకించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రాములోరి కల్యాణానికి హాజరై కల్యాణ వైభోగాన్ని కనులార వీక్షించారు. భక్తజనంతో రామాలయంతో పాటు కల్యాణ మండపం కళకళలాడింది. తెల్లవారుజామున రెండు గంటలకే ఆలయాన్ని తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళశాసనం, అభిషేకం జరిపారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హనుమంతరావుతోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి పి.నరసింహ పాల్గొన్నారు. అనంతరం 9.30కి కల్యాణమూర్తులను పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపు ప్రారంభమైంది. మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి 10 గంటలకు తీసుకొచ్చారు. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను గావించారు. ప్రత్యేక మంత్రాన్ని జపిస్తూ వేద పండితులు

మిగతా 7వ పేజీలో...

నేడు శ్రీరామ మహా పట్టాభిషేకం

పట్టువస్త్రాలు సమర్పించనున్న గవర్నర్ రాధాకృష్ణన్ 6

వేడుకలు వెల్‌డన్

అధికారులకు సీఎస్ ప్రశంస..



స్వామివారిని మిథిలాస్టేడియానికి తీసుకొస్తున్న దృశ్యం



తలంబ్రాల కోసం ఎగబడుతున్న దృశ్యం

పలువురు ప్రముఖుల రాక

సీతారామ కల్యాణాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం శ్రీనరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు రవినాథ్ తిలహరి, ఎన్.హరినాథ్, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.కిరణ్మాయి, సుమతి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, మిషన్ భగీరథ మంచినీటి ప్రత్యేక అధికారి, ప్రత్యేక కార్యదర్శి సురేంద్రమోహన్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శరత్‌లు తిలకించారు. అలాగే మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రముఖ సినీ నటులు దివంగత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తిలకించారు.

ఆదర్శనీయుడు శ్రీరాముడు : మంత్రి తుమ్మల

నగరంలో పలుచోట్ల నవమి వేడుకలకు హాజరు

ఖమ్మం సాంస్కృతికం, ఏప్రిల్ 17: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం నగరంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మంత్రి నగరంలో ఆయా చోట్ల ఏర్పాటు చేసిన కల్యాణోత్సవ వేదికలు, రామాలయాల్లో ఏర్పాట్లు చేసిన కల్యాణ మండపాలను దర్శించుకున్నారు. లోక కల్యాణం కోసం ఎన్నో త్యాగాలు చేసిన శ్రీరాముడు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయుడని, సీతారాముల పవిత్ర బంధం ప్రతి జంటకు మార్గదర్శకమన్నారు. ఈ సందర్భంగా కల్యాణ క్రతువులో పాల్గొనటంతో పాటు ప్రత్యేక పూజలు, అన్నదానాలు, తదితర కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటగా తన క్యాంపు కార్యాలయం శ్రీసిటీలోని రామాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం తుమ్మలగడ్డ చెరువుబజార్ ప్రాంతంలోని శ్రీదాసాంజనేయస్వామి దేవాలయాన్ని దర్శించుకొని కల్యాణ వేడుకను తిలకించారు. అనంతరం ట్రంకు రోడ్డులోని భ్రమరాంబసమేత గుంటు మల్లేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో వీడీవోస్ కాలనీ, బ్యాంకు కాలనీలోని శ్రీసీతారామచంద్ర ఆలయ కమిటీ నిర్వహించిన కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. బస్ డిపో రోడ్ బుర్హాన్‌పురంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి గుడి ప్రాంతంలోని బెస్తబజార్‌లో ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ నాయకులు రాయల నాగేశ్వరరావు, సాధు రమేష్ రెడ్డి, బాలగంగాధర్ తిలక్, మిక్కిలినేని నరేంద్ర, గరికపాటి వెంకటరావు, నున్న రత్నారావు, బండి జగదీష్, కమతం రామకృష్ణ, పాలెంపు వెంకటరమణ, పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్, మదూరి సైదరావు, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, మదూరి ప్రసాద్, దొడ్డ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న తుమ్మల



నిర్మానుష్యంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ 8

భానుడి భగభగ

జిల్లాలో భానుడు భగ భగ మండుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు మరింతగా పెరుగుతున్నాయి. ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారు. ఒంటిపూట పాఠశాలలు అయినప్పటికీ విద్యార్థులు అల్లాడుతున్నారు. జిల్లాలో బుధవారం దారెత్తించిన ఎండ, వడగాల్పులతో ఉష్ణోగ్రత పెరిగిపోయి 44 సెల్సియస్ డిగ్రీలకు చేరింది. భద్రాచలంలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

- కొత్తగూడెం

18వ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ వెలువడబోతుంది. జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఖమ్మం కలెక్టరేట్‌లో నోటిఫికేషన్ ఉదయం 11గంటలకు విడుదల చేయనున్నారు. నోటిఫికేషన్ విడుదల అనంతరం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ జరగనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం మూడు నియోజక వర్గాలు మహబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్నందున మహబాద్ లోక్‌సభ కు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు మహబాద్ కలెక్టరేట్‌లో నామినేషన్లు వేయాల్సి ఉంటుంది.

సమరానికి సై

నేడే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్

- నామినేషన్ల స్వీకరణకు రంగం సిద్ధం
- దాఖలుకు ఏర్పాట్లు చేసుకుంటున్న అభ్యర్థులు
- 19న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు...
- 24న బీఆర్ఎస్ అభ్యర్థి నామా
- కాంగ్రెస్ అభ్యర్థిపై ఇంకా కొనసాగుతున్న సస్పెన్స్
- ఖమ్మం కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ఖమ్మం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబాబాద్ లోక్‌సభ స్థానానికి అక్కడి కలెక్టర్ రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అక్కడ కూడా ఉదయం 11గంటలనుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. గురువారం నుంచి ఈనెల 25 సాయంత్రం 3 గంటల వరకు ఖమ్మం, మహబాద్ నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరగనుంది. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటించనున్నారు.

మే 13న లోక్‌సభ ఎన్నికలు జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేకంగా ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ముందుగా సందేహాలను తెలుసుకోవాలంటే హెల్ప్‌డెస్క్ ద్వారా సమాచారం తెలుసుకోవడంతోపాటు నామినేషన్ల నిబంధనలు, సమర్పించాల్సిన పత్రాల గురించి కూడా తెలియజేయనున్నారు. నామినేషన్ వేసేటప్పుడు సెక్యూరిటీ డిపాజిట్‌గా జనరల్ అభ్యర్థులు, రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాలి. ఖమ్మం కలెక్టరేట్‌లో నేటినుంచి వంద మీటర్ల దూరం వరకు ఎవరిని అనుమతించరు. ఉద్యోగులు, అధికారులు మాత్రం తమ గుర్తింపు కార్డులు చూపించి విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. నామినేషన్లను దృష్టిలో పెట్టుకుని దరఖాస్తుదారులు సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల వరకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. కేవలం పోటీచేసే అభ్యర్థి మూడు వాహనాలను మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుంది. లోక్‌సభ రిటర్నింగ్ అధికారిగా ఉన్న వీపీ గౌతమ్‌కు ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ సహాయ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

సిద్ధమవుతున్న అభ్యర్థులు

నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమవుతుండడంతో ఎన్నికల బరిలో దిగబోతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల ముహూర్తాలు నిర్ణయించుకుంటున్నారు. మంచి రోజులు, పేరుబలాలతో నామినేషన్లు దాఖలు చేసేందుకు నిర్ణయించుకుంటున్నారు. కొందరు ఆయాపార్టీల ముఖ్య నేతలను నామినేషన్లకు రప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థిగా పార్టీ సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయబోతున్నారు. ఇందుకుగాను గురువారం మంచిరోజు కావడంతో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ వద్ద బీఫామ్ పత్రాన్ని తీసుకునేందుకు హైదరాబాదు వెళుతున్నారు. నామాతోపాటు జిల్లాలోని ముఖ్య నేతలంతా కేసీఆర్ వద్ద సమావేశమవుతున్నారు.



మరోవైపు బీజేపీ అభ్యర్థిగా ఇప్పటికే ప్రకటించి ప్రచారంలో ఉన్న తాండ్ర వినోదరావు కూడా నామినేషన్ ముహూర్తాన్ని ఈనెల 19న నిర్ణయించుకున్నారు. శుక్రవారం వినోదరావు నామినేషన్‌కు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతున్నారు. సర్దార్‌పటేల్ స్టేడియం నుంచి నామినేషన్ దాఖలు చేసే కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించబోతున్నారు. మరోవైపు కాంగ్రెస్ టికెట్ ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నేడో రేపో అభ్యర్థిని ప్రకటించనున్నారు. ఇప్పటికే టికెట్ ఆశిస్తున్న కొందరు ఆశాపరులు పొంగులేటి ప్రసాదరెడ్డితో పాటు మరికొందరు ముందు జాగ్రత్తగా నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకుంటున్నారు.

రేపు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక 7



అన్నదానం చేస్తున్న దృశ్యం



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు

ఉడతా భక్తిగా..

రామయ్య సేవలో స్వచ్ఛంద సంస్థలు

భద్రాచలం, ఏప్రిల్ 17: భద్రాచలంలో బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించిన క్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు తమదైన శైలిలో సేవా కార్యక్రమాలను నిర్వహించాయి. భద్రాద్రి దేవస్థానం, అంబాసత్రం, క్షత్రియ సత్రం, సత్యసాయి సేవా సమితి, యూబీ రోడ్డు వర్తక సంఘం, రెడ్డి సత్రం, క్లాత్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్, సూపర్‌బజారు వర్తక సంఘం, నెహ్రూ మార్కెట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. రోటరీ, లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య మహాసభతో పాటు పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో వ్యాపారులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు, బెల్లం పానకం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న సాయి మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా అన్నదానం, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ మాజీ అధ్యక్షుడు దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మజ్జిగ ప్యాకెట్లను సైతం అందజేశారు. ది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పరిమి సోమశేఖర్ ఆధ్వర్యంలో పానకం మజ్జిగ భక్తులకు పంపిణీ చేశారు. భద్రాచలం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు. కేకే ఫంక్షన్ హాలు అధినేత కొండిశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కల్యాణానికి వచ్చిన భక్తులకు అన్నదాన సంతర్పణ చేశారు.

భారీగా మిగిలిన కల్యాణం టికెట్లు

- 40 నుంచి 50 శాతం ఉండే అవకాశం..
- ఇంకా అందని సమాచారం

భద్రాచలం, ఏప్రిల్ 17: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణ టికెట్లు భారీగా మిగిలాయి. 40 నుంచి 50 శాతం టికెట్లు మిగిలి ఉండే అవకాశం ఉందని దేవస్థానం వర్గాలు అంచనా వేస్తున్నాయి. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియంలో రామయ్య కల్యాణం నిర్వహించారు. ఇందులో మొత్తం 31,860 మంది రామయ్య కల్యాణంను తిలకించేందుకు అవకాశం ఉంది. 15,860 టికెట్లు విక్రయానికి అందుబాటులో ఉండగా ఆన్‌లైన్‌లో 11,190, ఆఫ్‌లైన్‌లో 4,670 టికెట్లు అందుబాటులో ఉంచారు. కల్యాణ సమయం సమీపిస్తున్న తరుణంలో జిల్లాలోని ఓ కీలక అధికారి కార్యాలయానికి 300 ఉభయదాతల టికెట్లు పంపినట్లు వినికిడి. అయితే ఈ టికెట్లు ఎంత మేరకు అమ్ముడయ్యాయో కూడా సమాచారం తెలియాల్సి ఉంది. ఈసారి తొలి నుంచి కల్యాణం తిలకించేందుకు విక్రయించే టికెట్లు మందకొడిగానే అమ్మకాలు సాగాయి. సీఎం సెక్టార్లో వీవీఐపీ రూ.10 వేలు, వీఐపీ రూ.5 వేలు చొప్పున టికెట్లను జిల్లా అధికార యంత్రాంగం విక్రయించగా వాటి అమ్మకాలపై వివరాలు తెలియాల్సి ఉంది.



శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

కల్యాణ మండపంపైకి ప్రవేశించకుండా చర్యలు

రామయ్య కల్యాణం అనంతరం సీఎం సెక్టార్‌లోని వీవీఐపీ, వీఐపీలతో పాటు ఇతర భక్తులు కల్యాణ మండపంపైకి ప్రవేశించకుండా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు చర్యలు చేపట్టారు. బుధవారం కల్యాణం జరిగిన అనంతరం మైకు ద్వారా ఆయన అటు పోలీసు అధికారులను, ఇటు భక్తులను సమన్వయం చేస్తూ మండపంపైకి ఎవరు రావద్దంటూ కోరారు. భక్తులకు బయటే తలంబ్రాలు పంపిణీ చేస్తున్నారని అక్కడ తీసుకోవాలని ఆయన సూచించారు. ఇదే సమయంలో ఒక ఎస్పై స్థాయి అధికారి భక్తులను ప్రాంగణంలోకి పంపించే ప్రయత్నం చేస్తున్నారని మైకుల ద్వారా కమిషనర్ పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడం పట్ల భక్తుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.

భక్తుల జేబులు చోరీ

శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం తిలకించడానికి భక్తులు భక్తి తన్మయత్వంలో ఉంటే కొంత మంది దొంగలు చేతివాటాన్ని ప్రదర్శించి చోరీలు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు ఉభయదాతల టికెట్లు తీసుకొని వెళ్లగా వారి వద్ద రూ.32 వేలు చోరీ జరిగినట్లు సమాచారం. మరికొంత మంది వద్ద సైతం ఇదే రీతిలో దొంగలు తమ చేతివాటంను ప్రదర్శించినట్లు వినికిడి.



దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

శ్రీరామ పునర్వసు దీక్షను స్వీకరించిన భక్తులు

కల్యాణ రాముడికి తిరువీధి సేవ

భద్రాచలం, ఏప్రిల్ 17: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ పునర్వసు దీక్షలో భాగంగా భక్తులు బుధవారం రాత్రి శ్రీరామ పునర్వసు దీక్షను స్వీకరించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున పునర్వసు దీక్షను స్వీకరించడం సంప్రదాయంగా వస్తోంది. 27 రోజుల అనంతరం మే 13న ఈ దీక్ష విరమణ ఉంటుంది. ఈ నేపథ్యంలో 27 రోజుల అనంతరం శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో భద్రాచలం రామాలయ ప్రాంగణంలో అర్చకుల సమక్షంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీరామ పునర్వసు దీక్షను స్వీకరించారు. భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం బుధవారం నిర్వహించగా రాత్రి కల్యాణ రామునికి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. మేళతాళాలు, భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ సీతారామచంద్రస్వామిని చంద్రప్రభ వాహనంలో ఊరేగించారు.

ముత్యాల తలంబ్రాలు సమర్పించిన

తొలి సీఎస్ శాంతికుమారి

భద్రాద్రి దేవస్థానం చరిత్రలో ఇదే తొలిసారి ..



భద్రాచలం ఏప్రిల్ 17: భద్రాచలం శ్రీసీతారాముల కళ్యాణంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించే అరుదైన అవకాశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారికి దక్కింది. తానిషాకాలం నుంచి ప్రభుత్వం తరుపున భద్రాచలంలో రామయ్య కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా దేవదాయశాఖ మంత్రులు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు పట్టువస్త్రాలు సమర్పిస్తూ వస్తున్నారు. అయితే ఈసారి ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎస్ శాంతికుమారి దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ అరుదైన అవకాశం దక్కిన తొలి ప్రధాన కార్యదర్శిగా ఆమె చరిత్రలో నిలిచారు. 1959లో భద్రాద్రి దేవస్థానం దేవదాయశాఖ పరిధిలోకి వచ్చిన అనంతరం ఈ 65 ఏళ్లలో సీఎస్ స్థాయి అధికారి పట్టు వస్త్రాలు, ముత్యాలు తలంబ్రాలు సమర్పించడం ఇదే తొలిసారి అని దేవస్థానంవర్గాలు పేర్కొంటున్నాయి.

నేడు రామాలయంలో



భద్రాచలం, ఏప్రిల్ 17: తెల్లవారుజామున 4 నుంచి 4.30 వరకు ఆలయం తెరుచట, సుప్రభాత సేవ నిర్వహిస్తారు. 4.30 నుంచి 6.30 వరకు ఆరాధన, నివేదన, శాత్తుముర్రై(దర్శనం లేదు), 6..30 నుంచి 9 వరకు: సర్వ దర్శనం, 9.30 నుంచి 10.30 వరకు శ్రీ సీతారాముల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకెళ్లే కార్యక్రమం ఉంటుంది. 10.30 నుంచి 12.30 వరకు శ్రీరామ పట్టాభిషేకం, 12.30 నుంచి 1.00 వరకు కల్యాణ మండపం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లుట, 1 నుంచి 2 గంటల వరకు మధ్యాహ్నిక, ఆరాధన, రాజగోబం, తలుపులు వేయుట, 3 నుంచి 6 వరకు సర్వ దర్శనం, శీఘ్ర దర్శనం ఉంటాయి. 6. నుంచి 6.30 వరకు ఆరాధన (దర్శనం లేదు). 6.30 నుంచి 9.30 వరకు సర్వ దర్శనం (ఉచితం), 7 నుంచి 9.30 వరకు రథోత్సవం, 10 నుంచి 10.30 వరకు ఆరగింపు, శాత్తుముర్రై, తలుపులు వేయుట.

వేడుకలు వెల్‌డన్..

సీఎస్ శాంతికుమారి ప్రశంసలు

కొత్తగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామనవమి మహోత్సవం బుధవారం దిగ్విజయంగా నిర్వహించడం పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాలతలంబ్రాలు సమర్పించిన సీఎస్ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం పట్ల దేవస్థానం కమిషనర్ హనుమంతరావును, జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్‌రాజును అభినందించారు. వేసవి దృష్ట్యా సెక్టార్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాంతిభద్రతల పర్యవేక్షణ, చలుపందిళ్లు, కూలర్లు, తాగునీరు, మజ్జిగతోపాటు అత్యవసర వైద్యసేవలకు వైద్యచికిత్స కేంద్రాలు, అంబులెన్స్‌లు, నిరంతరాయ విద్యుత్, పకడ్బందీ పారిశుధ్య నిర్వహణ, సమాచార కేంద్రాలు,తలంబ్రాలు, ప్రసాదాల కౌంటర్లు, వాహనాల పార్కింగ్ దిగ్విజయంగా ఏర్పాటు చేశారని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. కలెక్టర్ ప్రియాంక అల నేతృత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండ పకడ్బందీ ఏర్పాట్లు చేశారని, ఇది జిల్లా యంత్రాంగ సమష్టి కృషికి భక్తుల నుంచి లభించిన గౌరవమని అన్నారు. స్వామివారి వేడుకలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించేందుకు ప్రత్యక్ష ప్రసారం చేశామని, తద్వారా భద్రాచలం రాలేకపోయిన భక్తులు దేశ, విదేశాల నుంచి సీతారాముల కల్యాణ వేడుకలు కనులారా వీక్షించారని సీఎస్ పేర్కొన్నారు. గురువారం జరగనున్న మహాపట్టాభిషేకం కార్యక్రమాల వీక్షణకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సిద్ధంగా ఉండాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చక స్వాములు



గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు



ద్వారకా తిరుమల దేవస్థానం పట్టువస్త్రాలు



కొబ్బరికాయలతో బంతులాట



కల్యాణ రాముడికి తిరువీధి సేవ



మంత్రి సురేఖ, డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీ కవిత, మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ దంపతులు, కలెక్టర్ ప్రియాంక అలా, రామాలయ ఈవో రమాదేవి



భద్రాచల ఆలయ వైదిక సిబ్బందికి పచ్చలహారం అందజేస్తున్న పువ్వాడ నయన్‌రాజ్

రామయ్యకు పచ్చల హారం

భద్రాచలం, ఏప్రిల్ 17: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పచ్చల హారం బహూకరించారు. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం పువ్వాడ అజయ్ కుమారుడు నయన్‌రాజ్ భద్రాచలంలో రామాలయానికి వచ్చి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పచ్చలహారంను ఆలయ వైదిక సిబ్బందికి అందజేశారు.



రెండు వంతెనలపై వాహనాల రాకపోకలు

ట్రాఫిక్ కష్టాలకు చెల్లుచీటి..

రెండో వారధి నిర్మాణంతో భక్తులకు ఊరట

భద్రాచలం, ఏప్రిల్ 17: యేటా బ్రహ్మోత్సవాలు, అధ్యయనోత్సవాలసమయంలో ట్రాఫిక్ కష్టాలు భక్తులను వెంటాడేవి. ఈసారి గోదావరిపై భద్రాచలం వద్ద రెండో వారధి నిర్మాణం పూర్తికావడం భక్తులకు ఎంతో ఊరట లభించింది. భద్రాచలంలో ప్రవేశించేందుకు ఒక వారధి, బయటకు వెళ్లేందుకు మరో వారధి ఉండటంతో ట్రాఫిక్ కష్టాలు గతంతో పోలిస్తే దాదాపుగా లేవనే చెప్పాలి. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని రామయ్య కల్యాణం నాటికి రెండో వారధిని పూర్తి చేయించడంతో తమకు ఎంతో ఊరటనిచ్చిందని పలువురు భక్తులు పేర్కొన్నారు. రెండో వారధికి సారపాక నుంచి వచ్చే సమయంలో అప్రోచ్ రోడ్డుకు సైడ్‌వాల్స్ లేకపోవడంతో కొంత ఇబ్బందిగా ఉందని అధికారులు త్వరగా ఆ పనులు పూర్తి చేయాలని దాని ద్వారా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని వాహనదారులు సూచిస్తున్నారు. లైటింగ్‌ను సైతం త్వరలోనే ఏర్పాటు చేస్తే బాగుంటుందని వారు ఆకాంక్షించారు.

నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

- పట్టువస్త్రాలు సమర్పించనున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- పాల్గొననున్న దేవనాథ జీయర్‌స్వామి

భద్రాచలం, ఏప్రిల్ 17: కల్యాణం అనంతరం ఒక్క శ్రీ సీతారామచంద్రమూర్తికి తప్ప మరే ఇతర దైవానికి నిర్వహించని విలక్షణమైన ఉత్సవం మహాపట్టాభిషేకం.. ఇది భద్రాచల రామయ్యకు మాత్రమే దక్కుతుంది. నిత్యం జరిగే శ్రీరామపారాయణానికి అనుగుణంగా ప్రతినెల పుష్యమి రోజు జరిగే దాన్ని శ్రీరామ పట్టాభిషేకం గాను, ప్రతిఏటా శ్రీ సీతారాముల కల్యాణం అనంతరం మరునాడు జరిగే కార్యక్రమాన్ని శ్రీరామ మహా పట్టాభిషేకంగా పేర్కొంటారు. కాగా ప్రతి పుష్కరానికి (12 సంవత్సరాలు) జరిగే ఉత్సవాన్ని సామ్రాజ్య పట్టాభిషేకంగా, ప్రతి ప్రభవ నామ సంవత్సరంలో 60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఉత్సవాన్ని శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం గాను నిర్వహించడం ఈ క్షేత్ర సంప్రదాయం. అందులో భాగంగా 1927, 1987లో మహాసామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. అయితే భక్తుల సౌకర్యార్థం ఇందులో మార్పులు చేస్తూ పుష్కరానికి ఒకసారి పట్టాభిషేకం నిర్వహించాలని నిర్ణయించి 1999లో తొలిసారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. రెండోసారి 2011లో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహించారు. చివరిసారి 2023లో శ్రీరామ పుష్కరసామ్రాజ్య పట్టాభిషేకం చేశారు. మహాపట్టాభిషేకంలో శ్రీరాముడికి ఆభరణాలతో పాటు రాజదండం, రాజముద్రిక, ఛత్రం, శంఖు, చక్రాలు, కిరీటం ధరింపజేస్తారు. ఈ మహోత్సవానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కల్యాణ మండపంలో విస్తృత బందోబస్తు సిద్ధం చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్

శ్రీరామ మహాపట్టాభిషేకంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్ సీపీరాధాకృష్ణన్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈయన మహాపట్టాభిషేకానికి ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించిన మూడో గవర్నర్‌గా సీపీ నిలవనున్నారు. ఇందుకోసం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన భద్రాచలం రానున్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి 7గంటలకు బయలుదేరి 9.10కి భద్రాచలం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 9.20కి సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకుంటారు. 9.45కి అక్కడి నుంచి బయలుదేరి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకంలో పాల్గొంటారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనే ఈ సంప్రదాయానికి పూర్వ గవర్నర్ నరసింహన్ శ్రీకారం చుట్టారు. అత్యధికసార్లు పట్టాభిషేకంలో పాల్గొన్న ఘనత సైతం ఆయనదే. నరసింహన్ తరువాత అప్పటి గవర్నర్ తమిళిసై ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించారు. తాజాగా రామయ్య పట్టాభిషేకంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మూడో గవర్నర్‌గా రాధాకృష్ణన్ నిలిచారు.

మండపేటకు దక్కుతున్న ఆ గౌరవం



రామారెడ్డి రామయ్య సమర్పించిన నారికేళాలు

భద్రాచలం, ఏప్రిల్ 17: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణానికి మండపేట నుంచి శ్రీరాముడు, సీత, శంకు చక్రాలతో నారికేళాలను కేవీ రామారెడ్డి అనే భక్తుడు తన కుటుంబంతో తీసుకొస్తున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన రామారెడ్డి రామయ్యపై ఉన్న భక్తితో పెద్ద నారికేళాలను గుర్తించి వాటిపై శంకు చక్రాలను చెక్కించి యేటా స్వామి వారి కల్యాణం రోజున మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో వాటిని సమర్పిస్తున్నారు. ఈ విధంగా గత 24 ఏళ్లుగా ఆయన వాటిని సమర్పిస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రతీ సంవత్సరం భద్రాచలం దేవస్థానం వైదిక సిబ్బంది కల్యాణ సమయంలో ప్రత్యేకంగా వినియోగిస్తుండటం జరుగుతోంది.

అధికారులు సకాలంలో

సెక్టార్లకు చేరుకోవాలి

బూర్గంపాడు, ఏప్రిల్ 17: మహా పట్టాభిషేకం కార్యక్రమానికి గవర్నర్ విచేయనున్నందున విధులు కేటాయించిన అధికారులు ఉదయం 6గంటలకే కేటాయించిన హాజరుకావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ విశ్రాంతి భవనంలో బుధవారం రెవెన్యూ, డీఆర్‌డీఏ, జడ్పీ, పంచాయతీరాజ్, తదితర శాఖాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలకు విధులు కేటాయించిన సెక్టార్ల అధికారులు సకాలంలో సెకార్టకు చేరుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారని అన్నారు. మహాపట్టాభిషేకం కార్యక్రమాలను అదే స్ఫూర్తితో ఉదయం 6గంటలకు సెక్టార్లుకు చేరుకుని ఏర్పాట్లు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గవర్నర్ టైం టు టైం షెడ్యూల్ ఫాలో కావాలని అధికారులను ఆదేశించారు.

రమణీయం.. కమనీయం..

పర్ణశాలలో కన్నులపండువగా రామయ్య కల్యాణం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 17: భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి అనుబంధ ఆలయం మండలంలోని పర్ణశాల రామయ్య కళ్యాణ మంటపంలో బుధవారం అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం రమణీయంగా జరిగింది. తొలుత అందంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ పల్లకిపై ఊరేగింపుగా పచ్చిపూలతో అందంగా అలంకరించిన కల్యాణ మంటపానికి తోడ్కొని వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, పొడిచేటి సీతారామాచార్యులు, నరసింహాచార్యులు, భరద్వాజాచార్యులు, వేదపండితులు రవికుమార్‌శర్మల వేదమంత్ర ఉచ్చారణల నడుమ కల్యాణ క్రతువును శాస్త్రోపేక్తంగా నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు. కాగా శ్రీరామనవమి సందర్భంగా ఆలయానికి రూ.2లక్షల19వేల965ల ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రవణ్ కుమార్, ఆలయ ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో ముత్యాలరావు, సీఐ అశోక్, ఎస్ఐలు కేశవ్, గణేష్, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పర్ణశాలలో కల్యాణ వేడుక




వీక్షిస్తున్న భక్తులు, అధికారులు

మంటపంపై తొక్కిసలాట

కల్యాణం అనంతరం స్వామి వారిని ఆలయంలోకి తోడ్కొని వెళ్లాక మంటపంలో కింద పడిన తలంబ్రాల కోసం భక్తులు, పోలీసులు ఎగబడ్డారు. నియంత్రించాల్సి ఉన్న పోలీసు సిబ్బంది వాళ్లతో కలిసి తలంబ్రాల కోసం పోటీపడడంతో అక్కడ స్వల్పంగా తొక్కిసలాట జరిగింది. ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాలను పంపిణీ చేస్తామని ఆలయ సిబ్బంది ప్రకటించినప్పటికీ, తలంబ్రాల కోసం మంటపం వద్ద ఎగబడడం యేటా పర్ణశాలలో సర్వసాధారణంగా మారింది. పచ్చిపూలతో అందంగా ముస్తాబయిన కల్యాణ మంటపాన్ని క్రతువు జరిగిన కొద్ది నిముషాల్లోనే కొందరు భక్తి పేరిట ఎగబడి పూలను తుంచి తీసుకెళ్లడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

రేపు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక

● బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు నామినేషన్‌కు హాజరు



ఖమ్మంబైపా‌స్‌రోడ్, ఏప్రిల్ 17: ఈ నెల 19న ఖమ్మంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు నామినేషన్ వేయనున్న నేపథ్యంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాద్‌సింగ్ ఖమ్మం రానున్నారు. సాయంత్రం 3గంటలకు ఆయన ఖమ్మం చేరుకుని పటేల్ స్టేడియం నుండి బీజేపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు వెళ్లి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 3గంటల నుంచి 6గంటల వరకు పలువురు నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆపార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా నామినేషన్ అనంతరం సభకూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్టు బీజేపీ శ్రేణులు తెలిపాయి.

పచ్చబొట్టుతో శ్రీరాముడిపై భక్తిని చాటిన మహిళలు

● 'జైశ్రీరామ్' పేరును పచ్చబొట్టుగా ధరించిన 500మంది భక్తులు



'జైశ్రీరామ్' పేరును పచ్చబొట్టుగా ధరించిన మహిళలు

చింతకాని, ఏప్రిల్ 17: ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా మహిళలు తమ చేతులపై 'జైశ్రీరామ్' అనే పేరును పచ్చబొట్టుగా ధరించి తమ భక్తిని చాటుకున్నారు. వీరితో పాటు ఈ ఉత్సవాల్లో సుమారు 500 మంది భక్తులు తమ చేతులపై శ్రీరాముడి పేరును పచ్చ బొట్టుగా ధరించి తమ భక్తిని చాటారు. గ్రామానికి చెందిన టాటూయిస్ట్ శ్రీరాముల నాగరాజు సుమారు 3 గంటల పాటు శ్రమించి 500మంది భక్తులకు 'శ్రీరామ్' పచ్చ బొట్టును ముద్రించాడు. ఈ సందర్భంగా 'జైరామ్' నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ పూజా రి ఇంగువ విద్యాసాగర్ శర్మ, విశ్వహిందూపరిషత్, భజరంగదళ్, శ్రీ కోదండరామాలయ కమిటీ సభ్యులు మేకపోతుల ఉపేందర్, చింతాల కృష్ణ వర్మ, పిట్టల కృష్ణ, పెద్ది మహేష్, చొప్పర రంగారావు, వంకాయలపాటి ప్రసాద్, నెర్సుల బక్కయ్య, భక్తులు పాల్గొన్నారు.

కల్లూరులో మహిళ ఆత్మహత్యపై కేసు

కల్లూరు, ఏప్రిల్ 17 కల్లూరు పట్టణంలో భార్య, భర్తలిద్దరు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై స్థానిక పోలీసులు బుధవారం ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు పట్టణంలోని పుల్లయ్యబంజరు వీధివైపున ఉంటున్న చల్లా నరిసింహారావు(45) చల్లా పుష్పలు(40) మంగళవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, పరిస్థితి విషమించి భార్య పుష్ప మృతి చెందిన విషయం విదితమే. కాగా నర్సింహారావు పరిస్థితి విషమంగా ఉండడంతో మైరుగైన వైద్యం కోసం ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు తరలించారని సమాచారం. క్షణిక ఆవేశానికి లోనై పురుగు మందు తాగి వారిద్దరు ఎకకాలంలో ఆత్మహత్యకు పాల్పడ్డారని మృతురాలి తండ్రి గౌరవరపు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతురాలి తండ్రి వెంకటేశ్వరరావు వివరించాడు.

ముదిగిండలో నాలుగు సెల్‌ఫోన్ల చోరీ

ముదిగొండ, ఏప్రిల్ 17: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో బుధవారం నాలుగు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఫ్యాక్టరీలో పనిచేసే నలుగురు కార్మికుల ఫోన్లను ఓ గుర్తు తెలియని దుండగుడు చోరీ చేసినట్లు సీసీ కెమెరా పుటేజీలో బహిర్గతమైంది. గ్రానైట్ యజమాని సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 17: ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ట్రేస్‌చేసి ఖమ్మం అర్బన్ సీఐ బుధవారం బాధితులకు అప్పగించారు. నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల రెండు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో బాధితులు పోలీసులను ఆశ్రయించగా, వాటిని ట్రేస్‌చేసిన అర్బన్ సీఐ భానుప్రకాష్ బాధితులకు అప్పగించారు.

పులకించిన భద్రగిరి



భద్రాచలంలో బారులుదీరిన భక్తులు

(5వ పేజీ తరువాయి)

సంకల్పంతో స్వామివారికి ఎదురుగా సీతమ్మను కూర్చోబెట్టి కన్యావరణలు జరిపారు. రక్షాబంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీత ధారణ జరిపారు. యోక్త్ర బంధనం, వధూవరుల వంశ గోత్రాలకు సంబంధించి ప్రవరలు ప్రవచించారు. ఇదే సమయంలో ఆశీర్వచనం, పాద ప్రక్షాళన, పుష్పోదక స్నానం జరిపి వరపూజ నిర్వహించారు.

కల్యాణం సందర్భంగా సంప్రదాయబద్ధంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు. భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం, చింతాకు పతకం, రామమాడ తదితర ఆభరణాలను రామయ్యకు, సీతమ్మకు, లక్ష్మణస్వామికి ధరింపజేయడంతో మరింత శోభ చేకూరింది. సీతారాములకు శృంగేరి మఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, పట్టువస్త్రాలు అందజేశారు. అదేవిధంగా భక్తరామదాసు వారసుడు కంచర్ల శ్రీనివాసరావు పట్టువస్త్రాలు స్వామివారికి సమర్పించారు. అలాగే తూము నరసింహదాసు వంశీకులు కూడా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

భద్రాద్రి రాముని కల్యాణ వైభవ ప్రాశస్త్యంతో పాటు భక్తరామదాసు చేయించిన ఆభరణాల విశిష్టతను దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి వివరించారు. అర్చక స్వాములు మధుపర్కం ప్రాశన అనంతరం తేనె, పెరుగు కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించి నూతన వస్త్రాలంకరణ చేశారు. లోక పర్యంతాన్ని, విశ్వ సృష్టిని దానిలో ఉన్న కాలాన్ని దేశాన్ని తెలుపుతూ సంకల్పం చెప్పి కన్యాదాన కరిష్యే అంటూ ముగించారు. ఈ సమయంలో కన్యావరణలు, కొబ్బరిబొండం, తాంబూ లం, దక్షిణ స్వామి వారికి సమర్పించారు. కన్యాదానంతో పాటు గోదానం, భూదాన కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రామ భద్రుడికి సీతా మాతకు వేర్వేరుగా మంగళాష్టకం చదివారు.

సరిగ్గా 12గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని విశిష్టత వివరిస్తూ ఉత్సవమూర్తుల శిరస్సుపై ఉంచారు. అనంతరం దశరథుడు, జనకమహారాజు తరఫున భక్తుల తరఫున భక్తరామదాసు చేయించిన మూడు మంగళసూత్రాలతో సూత్రధారణ కన్నుల పండువగా నిర్వహించారు. ఆ తరువాత తలంబ్రాల ప్రాశస్త్యంను వివరిస్తూ తలంబ్రాల కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా అర్చకస్వాములు నిర్వహించారు. చివరగా భాగవోత్తముల ఆశీర్వచనంతో కల్యాణం ముగిసింది.

తరలివచ్చిన భక్తజనం

శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాద్రిలో జరిగిన శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని తిలకించడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దాంతో భద్రాద్రి భక్తజనంతో పులకించింది. వసతి సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక వైపు ఎండ వేడిమి తాళలేక, మరో వైపు కనీస మౌలిక వసతులు కరువై భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హోటళ్లతో పాటు శీతల పానీయ కేంద్రాల్లో రద్దీ ఏర్పడింది. బస్సులు దొరకక ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. భద్రాచలం వచ్చిన భక్తులు గోదావరి తీరాన్ని పట్టు పాన్పుగా చేసుకొని కరకట్టపైనే ని ద్రించారు. కాగా భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఆర్డీవో కె.దామోదర్‌రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మతసామరస్యాన్ని పెంపొందించడం అభినందనీయం

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ముస్లింలతో కలిసి నవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 17: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని కొత్తగూడెంలోని ముస్లింలు సేవా కార్యక్రమాలను చేపట్టడం మతసామరస్యానికి ప్రతీక అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మతాలకతీతంగా మనమంతా ఒక్కటే అనే భావాన్ని చాటుతూ ముస్లిం సోదరులు శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకాన్ని పట్టణంలోని ఉర్దుఘర్ సమీపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొని వారితో కలిసి పంపిణీ చేశారు. ఆయన వెంట జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, నాయకులు ఉన్నారు.

ముదిగొండ, ఏప్రిల్ 17: సాయం సంధ్యవేళ శ్రీరాముని కల్యాణం బుధవారం రాత్రి ముదిగొండ మండలం ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా జరిగింది. భద్రాచలం రాముని కల్యాణం అనంతరం తలంబ్రాలను తీసుకువచ్చి సాయంత్రం వేళ ముత్తారం దేవాలయంలో శ్రీరాముడి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవాదాయశాఖ అధికారి సమత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధా అర్చకుడు బొర్రా వాసుదేవచార్యుల బృందం కల్యాణతంతు నిర్వహించారు. ఈ కల్యాణ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్ బాబు, మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, వనం ప్రదీప్త, మల్లెల అజయ్ పాల్గొన్నారు.



మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

దర్గాలో శ్రీరామ నవమి వేడుకలు

● ఇల్లెందులో వినూత్న సంప్రదాయం

ఇల్లెందురూరల్,ఏప్రిల్17: శ్రీరామ నవమిని సాధరణంగా హిందువులు జరుపుకునే అతి పెద్ద వేడుక. కాని ఇల్లెందు మండలంలో ముస్లింలు హిందు సంప్రదాయ పద్ధతిలో శ్రీరామ నవమి వేడుకలను అంగరంగ వైభవంగా దర్గాలో నిర్వహించడం ఆనవాయితిగా వస్తుంది. ఇల్లెందు మండలం సత్యనారయణపురం సమీపంలో హజారాత్ నాగుల్‌మీరా దర్గాలో బుదవారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అంగరంగవైభవంగా జరిపించారు. దర్గా మాలిక్ సీతారాముల కల్యాణాన్ని హిందు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఈ వేడుకలకు హిందూ, ముస్లిం కుటుంబాల ప్రజలు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

అదేవిధంగా గురువారం దర్గాలో శ్రీరాముడి పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.



దర్గాలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్న ముస్లింలు



సీతారాములకు తలంబ్రాలను సమర్పిస్తున్న దృశ్యం

జమలాపురంలో వైభవంగా వైదేహి పరిణయం

ఎర్రుపాలెం, ఏప్రిల్ 17: మండలంలో జమలాపురం తోపాటు అన్ని గ్రామాల రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జమలాపురం ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం తరుపున వైదేహిని వధువుగా భావించి అర్చకుడు ఉప్పల రాజీవ్‌శర్మ శ్రీరామచంద్రమూర్తికి కన్యాదానం చేసి పరిణయ వేడుక వైభవంగా చేపట్టారు. బ్రహ్మశ్రీ పురాణం రవికుమార్‌శర్మ శాస్త్రోత్మకంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ వాఖ్యానంతో కల్యాణ ఘట్టం ఆద్యాంతం రమణీయంగా, ఆధ్యాత్మిక భావాలతో వెల్లివిరిసింది. ఆలయం ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు దంపతులు సీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. సాయంత్రం హనుమత్ వాహనంపై సీతారాముల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు, గ్రామస్థులు, భక్తుజనం పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరీ!

▸▸ నాలుగు నెలలకోకసారి వేతనంతో ఇబ్బందులు ▸▸ వివరాల సేకరణతో చిగురిస్తున్న ఆశలు ▸▸ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వినతి

ఖమ్మం కలెక్టరేట్ ఏప్రిల్17: "30 ఏళ్లుగా పంచాయతీ గుమస్తాగా పనిచేస్తున్నాం.. మా సగం జీవితం అయిపోయింది.. క్రమబద్ధీకరణకు అర్హులం కామా... అంటూ" నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో గుమస్తాలుగా.. పారిశుధ్య కార్మికులుగా..బిల్లు కలెక్టర్లుగా.. పంపు ఆపరేటర్లుగా.. మల్టీపర్పస్ కార్మికులుగా ఇలా కీలకమైన విధులు గ్రామపంచాయతీలలో నిర్వహిస్తూ ఏళ్లతరబడిగా వెట్టిచాకిరీ చేస్తున్నా తమ న్యాయమైన సమస్యలను, కోర్కెలను కూడా పట్టించుకోవడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇస్తున్న చాలీచాలని వేతనాలు కూడా సకాలంలో ఇవ్వాలని ఏళ్ల తరబడి పాలకులకు నివేదిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో21 మండలాల్లో 589 పంచాయతీల్లో సుమారు 4 వేల మందికి పైగా పంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లాలో 35 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులు సుమారు 160 మందికి పైగానే ఉన్నారు. ఏళ్లతరబడి ప్రజలకు, ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయడంలో గ్రామస్థాయిలో ప్రధాన భూమికను పోషిస్తూ సేవలు అందిస్తున్నా ఎప్పటికైనా క్రమబద్ధీకరించపోతారా అనే ఉద్దేశ్యంతో వేతనాలు ఆలస్యంగా వస్తున్నా పనిచేస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మందికి ఉద్యోగ వయస్సు కూడా దాటిపోయింది. తమని రోడ్డున పడేయకుండా క్రమబద్ధీకరణ చేయాలని వేడుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎన్నో ఆందోళనలను నిర్వహించినా శుష్కవాగ్దానాలిస్తు తాత్కాలికంగా ఆందోళనలను నివారించగలిగినా శాశ్వత ప్రాతిపదికన తమ సమస్యలను పరిష్కరించడంలేదని పేర్కొంటున్నారు.



కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమాచారాన్ని ఏప్రిల్ 6 లోగా అందించాలని జిల్లా పంచాయతీ అధికారులకు అందిన ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో ఏళ్లతరబడి పనిచేస్తున్న కార్మికుల ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త ప్రభుత్వమైనా తమ కోర్కెలను తీరుస్తుందెమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

వయోభారం పెరిగిపోతుంది

● రంగారావు, పెనుబల్లి



28 ఏళ్లుగా పంచాయతీలో గుమస్తాగా పనిచేస్తున్నా. వయోభారం పెరిగిపోయింది. అయినా నేటికీ క్రమబద్ధీకరణ చేయలేదు. నాలుగు నెలలకు ఒక్కో సారి, 8 నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీలో వచ్చే ఏ నిధుల నుంచైనా వేతనాలు అందించాలి.

గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు...

- గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిలకు వేతనాలు పెంచాలి
- రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలి
- జీవోనెంబర్ 112, 212లను సవరించి అర్హులను క్రమబద్ధీకరించాలి
- అర్హులైన ఉద్యోగ, కార్మికులందరికీ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు ఇవ్వాలి
- పీఎఫ్, ఈఎస్ఐ పింఛన్ సౌకర్యాలను వర్తింపచేయాలి
- జనశ్రీ బీమా స్థానంలో రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని అమలుచేయాలి
- అంత్యక్రియలకు చెల్లించే మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.20వేలకు పెంచాలి

అర్హతను బట్టి పోస్టుల్లో భర్తీ చేయాలి

పంగలాలయ్య, వెంకటాయపాలెం గుమస్తా



పంచాయతీల్లో 26 ఏళ్లుగా పనిచేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత ఉంది. మాకున్న అర్హతను బట్టి పోస్టుల్లో భర్తీచేయాలి. చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ సిబ్బందిని ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలి.

కిష్టారం సమస్యలపై సింగరేణి సీఎండీకి వినతి



సీఎండీ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న కిష్టారం గ్రామస్థులు

సత్తుపల్లి, ఏప్రిల్17: సింగరేణి ప్రధాన ప్రభావిత ప్రాంతమైన కిష్టారాన్ని కాలుష్యం కోరల్లోంచి రక్షించాలంటూ సింగరేణి సీఎండీ బలరాంను బుధవారం కిష్టారం గ్రామస్థులు హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సమీపంలోని సైలో బంకర్ కారణంగా దుమ్మూధూళి నుంచి గ్రామాన్ని విముక్తి చేయాలని, హరిజనవాడలో కూలిపోతున్న ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లతో పాటు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కిష్టారం నుంచి సత్తుపల్లి పట్టణం వరకు రోడ్డు మళ్లింపులపై చర్చించారు. అదేవిధంగా గ్రామంలో నిరుద్యోగ యువత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రైవేట్ సోర్స్ ఉదోగ్యాల కల్పన, అసంపూర్తిగా నిర్మించిన పంచాయతీ భవనం తదితర అంశాలపై వినతిపత్రం ద్వారా వివరించారు. స్పందించిన ఆయన అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ మెంబర్ రావి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ చెట్టుమాల రేణుకాఈశ్వర్, కొలపనేని ధనుంజయరావు, దండు యోహాన్, పుచ్చకాయల లక్ష్మారెడ్డి ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్17: ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన గుంజా మారేశ్వరరావు (38) కూలీ పనులకు వెళ్తూ ఉండేవాడు. కాగా రోజు మాదిరిగా మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన అతను రాత్రి అయినా ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడి కోసం వెతకగా బుధవారం తెల్లవారు జామున తామర చెరువులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని జాలర్ల సహాయంతో బయటకు తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు..

కామేపల్లి, ఏప్రిల్ 17: కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామ పంచాయతీకి చెందిన పంచాయతీ కార్మికుడి బానోత్ కిషన్(55) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. దహన సంస్కరణాల కోసం గ్రామ పంచాయతీ నుంచి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంచాయతీ కార్యదర్శి లావుడియా రాజేష్ చేతుల మీదుగా అందజేశారు. కిషన్ మృతి పట్ల వర్కర్ యునియన్ సంతాపం తెలిపింది.

గుర్తు తెలియని యాచకుడు...

పాల్వంచ, ఏప్రిల్17: పాల్వంచ మండలం జగన్నాథపురంలోని పెద్దమ్మగుడి పార్కింగ్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని యాచకుడి(55) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో సంబంధిత గ్రామ కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ చేసి మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచి మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. మృతుడు చామనచాయ రంగు ఉంటాడని, కోల ముఖమని, తెల్ల గడ్డం, సుమారు 5అడుగుల 6 అంగుళాల ఎత్తు ఉన్నాడని రూరల్ ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడు గుడి ప్రాంతంలో యాచన చేస్తూ అక్కడే ఉంటున్నాడని, మద్యం సేవించి ఆ మత్తులో వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ....

చింతకాని, ఏప్రిల్ 17: మండల పరిధిలోని బస్వాపురం గ్రామానికి చెందిన రసపుత్ర లలిత (31) ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మృతురాలిపై ఆమె భర్త ఈనెల 13న దాడి చేయగా, ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో ఆమెను స్థానికులు ఆటోలో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

కామేపల్లి, ఏప్రిల్ 17: వ్యవసాయ భూమిలో దుక్కిదున్నుతున్న క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ పై నుంచి పడిన డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన కెప్టెన్‌బంజరలో బుధవారం చోటు చేసుకుంది. కెప్టెనబంజరం గ్రామానికి చెందిన నర్సింహరావు పొలంలో దుక్కి చేస్తుండగా ట్రాక్టర్‌పై నుంచి కిందపడడంతో తీవ్ర గాయలయ్యాయి. గమనించిన స్థానికులు 108 సహాయంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పేదింటి యువతి వివాహానికి దాతల దాతృత్వం

▸▸ రూ. 30వేల నగదు, క్వింటా బియ్యం అందజేత

జూలూరుపాడు,ఏప్రిల్17: తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ చేతుల మీదుగా ఏదిగిన ఓ యువతి వివాహానికి అయ్యే ఖర్చులు భరించటానికి దాతలు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో బుధవారం సదరు యువతి వివాహానికి ఆర్థిక చేయూతను అందించారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలోని పెద్ద హరిజనవాడ గ్రామానికి చెందిన పూర్ణకంటి నాగమణి చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అప్పటి నుంచి అమ్మమ్మ అయిన పూర్ణకంటి సావిత్రమ్మ మనవరాలిని పెంచి పెద్ద చేసింది. డిగ్రీ చదువుతున్న నాగమణి వివాహం ఈ నెల 24న జరగనుంది. కాగా ఆమె వివాహన్ని జరిపించటానికి పేదరికం అడ్డు రావడంతో బంధువులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విషయం తెలుసుకున్న కొత్తూరు గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి ముందుకు వచ్చి కొంత మంది దాతల సహకారంతో సేకరించిన రూ.30వేల నగదు, క్వింటా బియ్యాన్ని గ్రామస్థులతో కలిసి ఆయన యువతికి అందజేశారు. దాతలు అందించిన సహాయానికి ఎప్పుడు రుణపడి ఉంటామని యువతి నాగమణి, ఆమె బంధువులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి శ్రీను, కొమ్ము కృష్ణ, రాంబాబు, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



యువతి నాగమణికి నగదును అందజేస్తున్న కృష్ణమూర్తి

గోదావరిలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడిన గజ ఈతగాళ్లు



కాపాడిన వ్యక్తిని వివరాలు అడుగుతున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 17: భద్రాచలంలోని గోదావరి నదిలో బుధవారం అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన అంకినపల్లి భద్రయ్య స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి గోదావరిలో కొట్టుకుపోతున్నారు. గమనించిన గజ ఈతగాళ్లు అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చినట్లు మత్స్యశాఖ అధికారి వీరన్న, ఫీల్డ్ అధికారి కోటేశ్వరరావు, మత్స్యశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.


మూడెకరాల మొక్కజొన్న పంట దగ్ధం

గుండాల,ఏప్రిల్ 17: నిప్పంటుకొని మూడెకరాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. మండలంలోని పడుగోనిగూడెం గ్రామానికి చెందిన ఊకె మల్లయ్య అనే రైతు మూడు ఎకరాల మొక్కజొన్న సాగు చేశాడు. కాగా పెట్టుబడి పెట్టి అరుగాలం శ్రమించిన పంట చేతికొచ్చింది. ఈ క్రమంలో బుధవారం స్థానికంగా ఉన్న అడవి కాలుతూ నిప్పులు ఎగసిపడి మొక్కజొన్న పంటకు అంటుకుంది. రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.



కాలిపోయిన మొక్కజొన్న పంట

పోస్టాఫీసు ద్వారా అందుబాటులోకి శ్రీరామ జన్మభూమి టెంపుల్ స్టాంపులు



శ్రీరామ జన్మభూమి టెంపుల్ స్టాంపు

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 17: శ్రీరామ జన్మభూమి టెంపుల్ తపాలా స్టాంపులు జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు హెడ్ పోస్ట్ మాస్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా రామ జన్మభూమి టెంపుల్ చిత్రపటంతో తపాలా శాఖ స్టాంపులను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ప్రజలు ఈ స్టాంపును సద్వినియో గించుకోవాలని కోరారు. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం రాముల వారి కల్యాణ తలంబ్రాల కోసం 800 మంది బుక్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో బుక్ చేసుకున్న వారికి తలంబ్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అత్తింటి ఎదుట ఆందోళనకు దిగిన కోడలు

● న్యాయం చేయాలని వేడుకోలు ● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



అత్తమామల ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన మహిళ

బోనకల్, ఏప్రిల్ 17: ఆర్థిక లావాదేవీలకు సంబంధించి అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం బోనకల్ స్టేషన్ ప్రాంతంలో అత్తింటి ఎదుట కొడలు ఆందోళనకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మానికి చెందిన కిల్లా రచనకు, బోనకల్‌కు చెందిన బండి సురేష్‌తో 2022లో వివాహమైంది. అత్తింటిల్లో భర్త కుటుంబీకులు తరుచూ వేధింపులకు గురి చేసే వారని ఆరోపించింది. తాను ఖమ్మంలో ఉద్యానవనశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుండగా, భర్త కూడా అక్కడే బ్యాటరీల హోల్‌సేల్ షాప్ నడుపుతుండేవాడని తెలిపింది. వ్యాపార లావాదేవీలకు సంబంధించి భర్త తీసుకున్న అప్పులకు తాను గ్యారెంటీ సంతకం పెట్టానని పేర్కొంది. కాగా ఇటీవల రైలు కింద పడి నా భర్త చనిపోయాడని పేర్కొంది. భర్త చనిపోక ముందు అప్పుల గురించి ఆయన కుటుంబ సభ్యులతో తరుచు గొడవలు జరిగేవని తెలిపింది. తన జీతం కూడా భర్తే తీసుకునే వాడని, చేసిన అప్పుల భారం ఎక్కువ కాగా అత్తమామలు పట్టించుకోక పోవడంతో తనను బాధ పెట్టేవారని వాపోయింది. భర్త చనిపోయిన తరువాత ఆయన ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు దొంగతనం చేశావని మానసికంగా ఇబ్బంది పెట్టారని పేర్కొంది. భర్త కుటుంబీకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానని తెలిపింది.

ట్రాక్టర్ యజమానిపై దాడి

ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

పాల్వంచ, ఏప్రిల్ 17: యాక్టింగ్ డ్రైవర్‌ను మాట్లాడుకునే విషయంలో మనస్పర్థలు వచ్చి యజమానిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన సరియం రంగారావుకు ట్రాక్టర్ ఉంది. అతను తన ట్రాక్టర్‌కు యాక్టింగ్ డ్రైవర్‌ను మాట్లాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బోర్రా సురేష్, అతని బావమరిది కీసర ఏడుకొండలు రంగారావుతో వాగ్వాదానికి దిగారు. దుర్భాషలాడుతూ అతనిపై దాడికి పాల్పడి, చంపుతామని బెదిరించారు. రంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

గురువారం 18 ఏప్రిల్ 2024

చూచు వారలకు చూడముచ్చటగా..

వైభవంగా సీతారాముల కల్యాణం

జై శ్రీరామ్ నినాదాలతో దద్దరిల్లిన గ్రామాలు

గిరిజన వాడల్లో వెల్లివిరిసిన కల్యాణ శోభ

ఆది దంపతులు సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణం నేపథ్యంలో జై శ్రీరామ్ నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. జిల్లా వ్యాప్తంగా కల్యాణ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుంచే క్రతువు ప్రారంభించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



నాచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే



పాల్వంచ భజన మందిరంలో పాల్గొన్న కూనంనేని



గట్టాయిగూడెం ఆలయంలో పాల్గొన్న వినోదరావు



కొత్తగూడెంలో పాల్గొన్న కోనేరు చిన్ని



ఆళ్లపల్లిలో..



సుజాతనగర్‌లో..



మణుగూరు కాలనీలో కల్యాణ తంతు



కరకగూడెంలో..



దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో..



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న పిచ్చేశ్వరరావు



కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో



చంద్రుగొండలో పాల్గొన్న దంపతులు



అశ్వారావుపేట మండలం తిరుమలకుంటలో



జూలూరుపాడులో నిర్వహించిన వేడుక



జూలూరుపాడులో కల్యాణ తంతు



సమితి సింగారంలో



అశ్వాపురం మండలం మొండికుంటలో



గుండాల మండలం పడుగోనిగూడెంలో..



అశ్వారావుపేటలో మజ్జిగ పంపిణీ..



కొత్తగూడెంలో వేడుకలో రంగా కిరణ్



ఇల్లెందులో నిర్వహించిన వేడుక

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 17: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తు మృతి చెందిన ప్రసాద్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్‌వోటు జీఎం మల్లయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ నాయకులు యాకూబ్ షావలి, సీఐటీయూ నాయకులు నబీ మాట్లాడుతూ కన్వీనేన్స్ లేబర్‌గా పని చేస్తున్న ప్రసాద్ విధుల్లో ఉండగా గుండెపోటుతో మంగళవారం మృతి చెందారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విధంగా మృతుడి కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ, సీఐటీయూ నాయకులు తాళ్లూరి కృష్ణ, పాయం వెంకన్న తోపాటు డ్రైవర్లు పాల్గొన్నారు.



ఎస్‌వోటు జీఎంతో మాట్లాడుతున్న నాయకులు

నీటి ఎద్దడిపై తక్షణమే స్పందించాలి



నీటి ఎద్దడి ఉన్న ప్రాంతంలో పర్యటిస్తున్న మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 17: ఇల్లెందు పట్టణంలోని వివిధ వార్డుల్లో నీటి సమస్య ఉందని ఫిర్యాదులు వస్తే అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీప ప్రాంతంలో నీటి ఎద్దడి ఉందనే సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండ ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నట్లు ప్రకటించారు. నీటి సమస్య నివారణకు పకడ్బందీగా ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఉంటే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుకమిటీ సభ్యులతోపాటు మున్సిపాలిటి ఫిట్టర్ ఫయ్యాజ్‌బాబ, కల్యాణ్ పాల్గొన్నారు.

భద్రాద్రిలో బానుడి భగ..భగ

భద్రాచలంలో 44.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మండుతున్న ఎండలు.. ప్రజల అవస్థలు

కొత్తగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బానుడు భగ.. భగ మండిపోతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు మరింతగా పెరిగిపోతోంది. ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారు. ఒంటిపూట పాఠశాలలు అయినప్పటికీ విద్యార్థులు సైతం ఎండ వేడిమితో పాఠశాలల నుంచి రాలేకపోతున్నారు. జిల్లాలో బుధవారం ఎండలు, వడగాల్పులతో ఉష్ణోగ్రత పెరిగిపోయి 44డిగ్రీలకు చేరింది. జిల్లాలోని భద్రాచలం వద్ద 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అశ్వాపురం మండల కేంద్రంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా పాత కొత్తగూడెంలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత, సుజాతనగర్‌లో 44.2, అశ్వాపురంలో 44, లక్ష్మీదేవిపల్లిలో 43, పాల్వంచ మండలం యానంబైలు వద్ద 43.5, జూలూరుపాడులో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. 40 నుంచి 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా వ్యాప్తంగా వడగాల్పులు వీచడం వల్ల వడదెబ్బకు గురైన ప్రజలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి చికిత్సలు చేయించుకుంటున్నారు. వృద్ధులు, పిల్లలు సైతం పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం 8గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. సాయంత్రం 6గంటలు అవుతున్నప్పటికీ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం లేదు. జిల్లాలో ప్రధాన పట్టణాలైన కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లో బోర్లు సైతం ఎండిపోయి నీటి ఎద్దడి ఏర్పడింది. చెరువుల్లో సైతం నీరులేక పోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోరుబావుల్లో నీరు కిందకుపోవడంతో అయా ప్రాంతాల్లో నీటికొరత ఏర్పడిందని చెప్పవచ్చు. దూర ప్రయాణాలు కొనసాగించే ప్రయాణికులు బస్సుల్లో మధ్యాహ్నం ప్రయాణించలేక రాత్రి వేళల్లోనే ప్రయాణిస్తున్నారు. పెరుగుతున్న వడగాల్పులు, ఉష్ణోగ్రతలకు ప్రజలు అల్లాడిపోతు శీతలపానియాలకు మరింత గిరాకీపెరిగింది. కొబ్బరిబొండాలు, తాటిముంజలు, చెరుకు రసాలు తదితర శీతలపానియాలతో ప్రజలు కాస్త ఉపశమనం పొందుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు కూడా ఉష్ణోగ్రతలు అధికమైనప్పటికి ఏర్పాటు చేయలేదు. పట్టణాల్లో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ఎండవేడిమిని తట్టుకోలేక ముఖాలకు ఖర్చీపులు కట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. మధ్యాహ్నం వేళ పట్టణాల్లో పలు వ్యాపారానికి సంబంధించిన షాపులన్నీ జనసంచారం లేక పోవడంతో వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నం వేళ చిరువ్యాపారులు ఉష్ణోగ్రతలను తట్టుకోలేక చిన్న చిన్న షాపులను మూసివేస్తున్నారు. ఇళ్లకే ప్రజలు పరిమితమై ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు పెట్టుకుని సేదతీరుతున్నారు. మొత్తం మీద మరింతగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు చెప్తున్నారు. వృద్ధులు, పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని అత్యవసరమైతేనే బయటకు రావాలని కూడా పేర్కొంటున్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లో సింగరేణి బొగ్గుబావులు ఉండటం వల్ల ఓపెన్‌కాస్టు గనుల వల్ల మరింత ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. అయా ప్రాంతాల్లో కార్మికులు సైతం తమ విధులకు వెళ్లాలంటే పలు ఇబ్బందులు తప్పడం లేదు. ఓపెన్‌కాస్టు గనుల్లో మధ్యాహ్నం వేళ విధులు నిర్వర్తించాలంటే ఎండవేడిమితో ఉష్ణోగ్రతలు పెరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్మికులు అనారోగ్యానికి గురై నీరసపడిపోతున్నారు. సింగరేణి యాజమాన్యం మజ్జిగ ప్యాకెట్లు అందచేసి కొంత ఉపశమనాన్ని కలిగిస్తోంది.



నిర్మానుష్యంగా ఉన్న కొత్తగూడెం బస్టాండ్ సెంటర్



వెలవెలబోతున్న పోస్టాఫీసు సెంటర్



నిర్మానుష్యంగా విజయవాడ రోడ్డు



తాటిముంజల కొనుగోలు

రామాలయ నిర్మాణానికి..

రూ.1.25లక్షల విరాళం

అశ్వాపురం, ఏప్రిల్ 17: అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంటలో నిర్మిస్తున్న సీతారాముల చంద్రస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన జాలె రామకృష్ణారెడ్డి దంపతులు రూ.లక్షా పాతికవేల రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మేరకు శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం సంబంధిత నగదును ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మర్రి మల్లారెడ్డి, మేడవరపు సుధీర్, పాటి ప్రకాశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

250 మద్యం బాటిళ్ల పట్టివేత

దమ్మపేట, ఏప్రిల్ 17: 250 మద్యం బాటిళ్లు పట్టుకున్న ఘటన చలమప్ప గూడెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. చలమప్పగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ వుంచిన 250 మద్యం బాటిళ్లను సమాచారం మేరకు ఎఫ్ఎస్ఎస్టీ టీం కృష్ణ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.



అధికారులు పట్టుకున్న బాటిళ్లు

ఐఎన్‌టీయూసీ సభలను జయప్రదం చేయాలి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 17: గోదావరిఖని ఏరియాలో ఈ నెల 21న జరిగే ఐఎన్‌టీయుసీ మహాసభలను జయప్రదం చేయాలని ఏరియా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు కోరారు. బుధవారం ఏరియాలోని పీవీ కాలనీ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు ఐఎన్‌టీయుసీ ముందుంటుందని, ఇందులో భాగంగానే సింగరేణి సంస్థలో కార్మికుల హక్కుల సాధనకు, సౌకర్యాల కల్పనకు చేపట్టవలసిన అంశాలను మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల హక్కులకై అనేక పోరా టాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్, రాయలింగు, మస్తాన్, జయరాజు, శ్రీనివాస్, సంతోష్ చరణ్, చేతన్, పెద్దనాగయ్య, రాము, రామకృష్ణ, వర్మ, సుధాకర్, మార్కు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వారు

జాబ్ సమస్య పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాసర్ పాషా

మణుగూరుటౌన్, ఏప్రిల్ 17: సింగరేణి వ్యాప్తంగా ఓసీ గనుల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ.. బుధవారం ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎస్‌వీకే శ్రీనివాస్, జీఎం పర్సనల్ హనుమంతరావుకు వినతి పత్రాలందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్ల సంఘం నాయకులు నాసర్‌పాషా విలేకరులతో మాట్లాడారు. గత రెండున్నరేళ్ల క్రితం కేంద్ర కార్మిక శాఖ అధికారుల మధ్యవర్తిత్వంతో సింగరేణి యాజమాన్యానికి, ఆరు కార్మిక సంఘాలకు కుదిరిన ఒప్పందం నేటికి అమలు కాలేదన్నారు. ఒప్పందం ప్రకారం కమిటీ వేయని కారణంగా పలువురు డీ ప్రమోట్ అయి జనరల్ మజ్దూర్‌లుగా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైన యాజమాన్యం సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సాయిపురంలో నీటి ఎద్దడి

వారం రోజులుగా నీరు లేక ప్రజల అవస్థలు



నీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు

ములకలపల్లి, ఏప్రిల్ 17: అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామపంచాయతీ శివారు గ్రామం సాయిరాంపురంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గత వారం నుంచి తాగునీరు లేక ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. మోటారు మరమ్మతులకు గురై వారం రోజులు అవుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఎద్దడి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, గ్రామపంచాయతీ కార్యదర్శికి, ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. ఈ సమస్యకి పరిష్కారం దొరక్కపోతే గ్రామస్తులతో కలిసి ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఎండలు ముదురుతున్న ప్రస్తుత తరుణంలో నీటి ఎద్దడి సమస్య వేధిస్తుంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. ఈ సమస్యని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవ చూపి మోటారు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.